

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ :మూలాపేట బాలికోన్నత పాఠశాల ఆధునీకరణ పనులను మంత్రి నారాయణ నగర కమిషనర్ నందన్ తో కలిసి పరిశీలిం చారు. నిర్మాణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు వేగంగా చేస్తున్న డీఎస్ఆర్ కంపెనీ సిబ్బందిని మంత్రి అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో అధునాతన వసతులు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వీఆర్సీ స్కూల్ ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దామని తెలిపారు. సీఎస్ఆర్ ఫండ్స్ కింద కోటి ఇరవై లక్షల విలువ చేసే 4 బస్సులను యూనియన్ బ్యాంకు అంద జేసిందన్నారు. విఆర్ఎంసి స్కూల్ స్ఫూర్తితో మూలాపేట స్కూల్‌ను డిఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ అధినేత సుధాకర్ రెడ్డి దత్తత తీసుకొన్నారని తెలిపారు. 40 వేల చదరపు అడుగుల్లో అద్భుతమైన నిర్మాణం చేస్తున్నారన్నారు. రెండు ఫ్లోర్‌ల నిర్మాణం పూర్తయిందని, నర్సరీ నుంచి పదో తరగతి వరకు పేద పిల్లలకు కార్పొరేట్ విద్య అందిస్తామని స్పష్టం చేశారు.

పసిడి ధరలు జోరు..!

పసిడి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కంటిమీద కునుకునివ్వడం లేదు.. బంగారం మాఫియా చేతుల్లో పడి విలవిల్లాడుతోంది..యుద్ధం.. ఇతర కారణాలతో రోజు రోజుకు ధరలు ఆకాశనంటు తున్నాయి.. తానేమి తక్కువ కాదంటూ వెండి చెలరేగి పోతోంది.. మాఫియా పది రూపాయాలు ధరలు పెంచి, ఒక్క రూపాయి ధర తగ్గించి తమాషాలడుతున్నా ప్రభుత్వం ధరల మీద నియంత్రణ లేకుండా పోతోంది. శుభకార్యాలకు బంగారం, వెండి కొనుగోలు చేయడానికి జనం భయపడిపోతున్నారు.. ఇప్పట్లో ధరలు అందుబాటులో ఉండే పరిస్థితులు కనిపించడం లేదు.. ఇదే సమయంలో వ్యాపారాలు లేక షో రూమ్‌లు.. షాపులు వెలవెలబోతున్నాయి.. స్వర్ణకారుల జీవితాలు అతలాకుతలమౌతున్నాయి.

- వ్యాపారం బేజారు..
- స్వర్ణకారుల జీవనం అస్తవ్యస్తం
- బంగారం 10 గ్రాములు రూ .1.23.400
- వెండి కేజీ రూ 1.64,700

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

బంగారం, వెండి ధరలు రోజు రోజుకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. గత కొద్ది రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు నియంత్రణ కోల్పోయాయి. ఇందుకు యుద్ధం, బంగారు ఉత్పత్తి తగ్గిపోవడం, కొందరు మాఫియా చేతుల్లో పడి ధరలు నియంత్రణ లేకుండా పోయాయి. అప్పుడప్పుడు వేలల్లో ధరలు పెంచి , అప్పుడప్పుడు వందల్లో ధరలు తగ్గిస్తున్నారు. బంగారం, వెండి డబ్బున్నవారికి వరం. పెద్ద స్థాయిలో బంగారం కొనుగోలు చేసి, నిల్వ చేసుకొని, ధరలు పెరిగిన తర్వాత అమ్మకాలు చేసుకొని సొమ్ము చేసుకుంటారు. ఇది వారి ఆర్థిక స్థోమతను పెంచుతోంది. సామాన్య, మధ్య తరగతి జనం మాత్రం ఇందుకు భిన్నం. పిల్లల పెళ్లిల్లు.. ఇతర శుభకార్యాలయాలకు బంగారం ఒక అవసరంగా మార్పు చేశారు. డబ్బున్నా, పేదరికంలో ఉన్నా బంగారం , వెండి కొనుగోలు చేసి ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల సామాన్యజానానికి ఏమాత్రం అందుబాటులో లేకుండా బంగారం, వెండి ధరలు పెరిగిపోయాయి. ఇక ధరలు తగ్గడం అసాధ్యంగా కనిపిస్తుంది. బంగారం ఒక కలగా మిగిలిపోతొంది. శనివారం నెల్లూరు బులియన్ మార్కెట్ ధరలు పరిశీలిస్తే బంగారం 10 గ్రామాలు (అపరంజి) 1,23,400, ఒక గ్రాము రూ 11,809 , సవర (8 గ్రాములు) 94,472 గా ఉంది. వెండి ఒక గ్రాము ధర రూ 164 ఉండగా, కేజీ ధర రూ 1,64,700 గా ఉంది. ఈ ధరలు దాదాపు కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి కొన సాగుతున్నాయి. ఆ నేపథ్యంలో వ్యాపారులు పెద్దగా బంగారం కొనుగోలు చేసి నిల్వలుచేసే పరిస్థితుల్లో లేరు. పెద్ద పెద్ద షోరూమ్‌లు తమ వద్ద ఉన్న బంగారం అమ్ముకోడానికి అనేక రాయితీలు పెడుతున్నా పెద్దగా వ్యాపారాలు సాగడం లేదు..

వ్యాపారం బేజారు..!

బంగారం వ్యాపారానికి నెల్లూరు పెట్టింది పేరు. ఒకప్పుడు చెన్నెయ్ వెళ్లి కొనుగోలు చేసే వారు ఇప్పుడు మార్కెట్ నెల్లూరుకు రావడంతో ఇక్కడే కొనుగోలు చేస్తున్నారు. చిన్నబజార్, పెద్దజజార్,తోపాటు అనేక చోట్ల బంగారం వ్యాపారం బారీగా విస్తరించింది. ఇటీవల కాలంలో జయాలుక్కాస్, టాటా గోల్డ్, మల్‌బార్ గోల్డ్, తోపాటు నెల్లూరు కేంద్రంగా అనేక వ్యాపార సంస్థలు జ్యువెలరీ షాపులు ప్రారంభించాయి. కొద్ది రోజులుగా నెలవారీ స్కీమ్‌లు ఏర్పాటు చేసి, బంగారం అమ్మకాలు చేసేవారు. ఇప్పుడు పెరుగుతోన్న ధరలతో ఆ వ్యాపారం కూడా ముందుకు సాగడంలేదు. ఒకప్పుడు కళకళలాడిన బంగారం షాపులు, ఇప్పుడు వెలవెలపోతున్నాయి. 25 ఏళ్ల కిందట సవర బంగారం ధర కేవలం రూ 9 వేలు ఉంటే, ఇప్పుడు సవర ధర రూ 94 వేలు బంగారం ఏ స్థాయిలో పెరిగిపోయిందో అర్థం అవుతోంది. జనం వద్ద డబ్బు నిల్వలున్నప్పుడు బంగారం కొనుగోలు చేసి దాచుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. నెల్లూరు జిల్లా వ్యాపితంగా వేలాది మంది స్వర్ణకారులు బంగారు అభరణాలు తయారీ చేసే పనిలోఉన్నారు. ఇక్కడ నుంచి చెన్నెయ్, బెంగుళూరుకు సరుకు వెళుతొంది. పెరిగిన ధరలతో వ్యాపారాలు లేకపోవడంతో స్వర్ణకారులకు పనులు లేకుండా పోయాయి. అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. ఇతర పనుల మీద దృష్టి పెడుతున్నారు. బంగారు తయారీల్లో యంత్రాలు రావడంతో కొంత పని తగ్గింది. ఇప్పుడు ధరలు పెరగడంతో పూర్తిగా పనులు లేకుండా పోయాయి. పరిస్థితి ఇలానే కొనసాగితే స్వర్ణకారుల పరిస్థితి మరింత దయనీయంగా తయారవుతోంది.

స్వర్ణకారుల పరిస్థితి దయనీయం

బంగారం ధరలు పెరగడంతో పనులు లేక స్వర్ణకారులు 99 శాతం మంది దయనీయ స్థితిలో ఉన్నారు. స్వర్ణకారులు, ఆధారిత కార్మికులు బతకలేని స్థితిలో కొట్టుమిట్టాడు తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి బంగారు పనుల కోసం వచ్చిన స్వర్ణకారులకు పనులు లేవు. స్వర్ణకారేతలు నెల్లూరులో ఎక్కువ మంది ఉన్నారు. వీరికి పనుల పూర్తిగా లేకుండా పోయాయి. కుటుంబాలు జీవనం కష్ట తరంగా మారుతొంది,. ప్రభుత్వం ఇతర రంగాల వలే స్వర్నకారులను ఆదుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం దృష్టిపెట్టాలి

అర్కాట్ కుమార్, స్వర్ణకారుల సంక్షేమ సంఘం నేత

అర్కాట్ కుమార్,
స్వర్ణకారుల సంక్షేమ సంఘం నేత

కార్పొరేట్ శక్తులకు సహజ సంపద ధారాదత్తం..

వ్య.కా.సం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బి. వెంకట్

ప్రజాశక్తి-నెల్లూరు

ఎన్‌డిఎ ప్రభుత్వం దశల వారీగా దేశంలోని సహజ సంపదను, వనరులను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అప్పగిస్తుందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్ విమర్శించారు. ఆదివారం నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. ఇటీవల బీహార్ బిజెపి సాధించిన విజయం ప్రజల మద్దతుతో కాదని, కేవలం కులం పేరుతో, మతం పేరుతో ప్రజలను చీల్చి కుట్రలు, కుతంత్రాలతో సాధించిందన్నారు. ఎపిలో కృష్ణపట్నం పోర్టు నుంచి దేశంలోని అన్ని షిప్‌యార్డులు, విమానయాన సంస్థలను అదానికి అప్పగిస్తుందన్నారు. జిఎస్‌టి పేరుతో ప్రజల నుంచి లక్షల కోట్ల రూపాయలను దోచుకొని ఇటీవల తగ్గించామంటూ సంబరాలు పేరుతో కర్నూల్‌కు రావడం, ఆ కార్యక్రమాలల్లో రాష్ట్ర సిఎం నారా చంద్రబాబు నాయుడు హాజరు కావడం విడ్డూరంగా ఉందన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడితో నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఫెవికాల్ బంధం కంటే గట్టిబంధం ఉందని ఎద్దేవా చేశారు. ఆబంధం వల్ల సమాజానికి నష్టమే తప్ప లాభం లేదన్నారు. విశాఖపట్నానికి గూగూల్ వస్తుందని నరేంద్రమోడి, చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ ఒకరిని మరొకరు పొగడ్తలతో ముంచేత్తుకుంటున్నారని వాస్తవానికి లక్ష కోట్ల పెట్టుబడితో వస్తున్న సంస్థకు 22 వేల కోట్లు రాయితీ ప్రకటించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ప్రపంచంలో ఎక్కడైనా ఒక సంస్థ స్థాపనకు పెట్టుబడిలో 5వ వంతు రాయితీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజా పాలన విస్మరించి భూ మాఫియాగా పనిచేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ ఒక మంచి పథకమని,అటువంటి పథకానికి నిధులు తగ్గించడం దారుణమన్నారు. జిల్లాలో ఉపాది హామీ పథకం కింద కోట్ల రూపాయలు బకాయిలున్నాయన్నారు. వీటి కోసం దేశ వ్యాప్తంగా పంచాయితీ కార్యాలయాల ముట్టడి, దిగ్బంధన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కంకణల ఆంజేయులు, జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అన్వర్ బాషా పాల్గొన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి సాధనకు ప్రజా ఉద్యమం యథాతథం..!

- మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం
- 2 వేల మందితో మానవహారం
- ప్రజల నుంచి విశేష స్పందన

ప్రజాశక్తి-నెల్లూరు

చింతారెడ్డి పాళెం జంక్షన్ ప్రాంతంలోని జాతీయ రహదారి వద్ద టోల్ ప్లాజా లేని అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వం శంఖుస్థాపన చేసే వరకు ప్రజా ఉద్యమం యథాతథంగా జరుగుతుందని, అండర్ పాస్ బ్రిడ్జి సాధన పోరాట కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. ఆదివారం అండర్ పాస్ బ్రిడ్జి సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో చింతారెడ్డి పాళెం జంక్షన్ ప్రాంతం నుంచి అపోలో వైద్యశాల సెంటర్ , ముత్తుకూరు గేట్ ప్రాంతం వరకు ప్రజలు మానవహారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హజరైన మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చింతారెడ్డి పాళెం జంక్షన్ ప్రాంతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి లేదా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ గడిచిన కొన్ని ఏళ్ళ నుంచి ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల నుంచి ప్రజలు దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆలోచన చేశారన్నారు. ఆ ప్రాంతంలో అండర్ పాస్ బ్రిడ్జికి శంఖుస్థాపన చేసే వరకు ఎటువంటి పరిస్థితుల్లోనో పోరాటం నిలిపివేయకుండా యథాతథంగా కొనసాగించాలని అండర్ పాస్ బ్రిడ్జి సాధన కమిటీ నిర్ణయం తీసు కుందన్నారు. ఆ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలతో చర్చలు చేపట్టి ఒక పోరాట కమిటీ ఆవిర్భవించిందన్నారు. ఆ పోరాట కమిటీ పిలుపులో భాగంగా భారీ స్థాయిలో మానవహార కార్యక్రమం చేపట్టామన్నారు.ఈ మానవహారం చింతారెడ్డి పాళెం జంక్షన్ నుంచి అపోలో వైద్యశాల సెంటర్ ప్రాంతం వరకు చేపట్టామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి మానవహారంలో నిలుచొని ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తున్నారంటే సమస్య ఎంత తీవ్రమైందో ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా పోరాటం చేస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని మంత్రి, పార్లమెంట్ సభ్యుల పేర్లతో కొంత మంది నాయకులు ఒకరికొకరు పొంతన లేకుండా రకరకాలుగా ప్రకటనలు చేయడం ప్రజల్లో గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. వాస్తవంగా ఈ ప్రకటనలు నిజమైనవైతే మంత్రి గానీ, పార్లమెంట్ సభ్యులు గానీ స్థానిక ఎంఎల్ఎ గానీ కలెక్టర్ ప్రజల వద్దకు వచ్చి నేరుగా చెప్పాలన్నారు. ఈ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు ప్రభుత్వం ఎంత కేటాయించింది.. నిర్మాణ పనులు పలానా రోజు ప్రారంభిస్తామని, ఇన్ని నెలల్లోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు కోటిరెడ్డి మాట్లాడారు. రహదారుల నిర్మాణంలో భాగంగా ఏ ప్రాంతంలో ప్రజల రద్దీ ఎక్కువగా ఉంటుందో పూర్తి స్థాయిలో పరిశీలించి రోడ్డు ప్రమాదాల నివారణకు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అటువంటి ప్రయత్నం ప్రభుత్వం చేయకపోవడం వల్ల ఇప్పటికే వందలాది మంది ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారన్నారు. ప్రాంతంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలియజేయాలని, అందుకు తగిన విధంగా నిర్మాణ పనులకు సంబంధించి శంఖుస్థాపన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అండర్ పాస్ బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 16 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఈ ప్రాంతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించే వరకు పోరాటం నిలిపేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జూదాల సుధాకర్, ప్రసాద్ నాయుడు, సాధన కమిటీ నాయకులు కట్టా సతీష్, కొట్టె రామూర్తి, కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, మస్తాన్‌బీ, షాహీనా బేగం, డాక్టరు ఎం.వి.రమణయ్య, రంజిత్ రెడ్డి, జి.నాగేశ్వరరావు, పి.సూర్యనారాయణ పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మానవహారంలో పాల్గొన్న ప్రజలు

జాలిరెడ్డికి సన్మానం

ఉలవపాడు :వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కేశవరపు జాలిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఉలవపాడులో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ బాషా జాలి రెడ్డి దంపతులను పూలమాల వేసి దశాలలతో ఇరువురు సత్కరించారు. ఖాదర్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవి ఉలవపాడు మండలానికి చెందిన జాలి రెడ్డికి రావడం గర్వంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తి అని కొని యాడారు. కేక్ కట్ చేశారు. షేక్. సంధాని భాష, కారుణ్య ఉన్నారు.

ముువ్వా కొండయ్యకు పరామర్శ

ముువ్వా కొండయ్యను పరామర్శిస్తున్నసిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు పట్టణ సిపిఎం సీనియర్ నాయకులు డాక్టర్ ముువ్వా కొండయ్యను సిపిఎం నాయకుల బందం ఆదివారం కలిసి పరామర్శించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తో పాటు సిపిఎం కందుకూరు పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్,సిపిఎం కందుకూరు పట్టణ కమిటి నాయకులు ఎస్కే సుల్తానా,టి వెంకట్రావ్, ఎస్కే మల్లికా,ఎం పద్మ,ఐద్వా నాయకులు ఎస్‌కె షాహీదా,ఎస్‌కె అస్మా తదితరులు కలిసి పరామర్శించారు. డాక్టర్ ముువ్వా కొండయ్య గత కొంతకాలంగా అనారోగ్య సమ స్యలతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆయన కందుకూరు ప్రాంతంలో సిపిఎం విస్తరణ కోసం పనిచేశారు.

కార్మికులకు పని కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి- ఉలవపాడు : మండలంలోని కరేడు పిటిపి ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రతిరోజు పని కల్పించాలని సిపిఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ జరిగిన ప్రాంతీయ కమిటీ సమావేశానికి ప్రాంతీయ కమిటీ సభ్యురాలు ఇందిరావతి అధ్యక్షత వహించారు. కార్యదర్శి జీవీబీకుమార్ మాట్లాడారు. **30న శిక్షణ తరగతులు :** ఈనెల 30న సిపిఎం ఉలవపాడు,వలేటివారి పాలెం మండలాల పరిధిలోని సిపిఎం సభ్యులకు రాజకీయ తరగతులను నిర్వహిస్తున్నట్లు జివిబి కుమార్ తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు ఎస్. డి గౌస్ బాషా,సాదు చెన్నకేశవులు, దువ్వూరి జాన్, వీసం విజయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జివిబి కుమార్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు +ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కారక్రమం సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు

బాస్కెట్ బాల్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 14,17 బాల బాలికల బాస్కెట్బాల్ జట్ల ఎంపిక ఆదివారం కందుకూరు టి ఆర్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానములో జరిగింది.జిల్లా నలు మూలల నుండి సుమారు వందమంది బాలబాలికలు ఎంపికలలో పాల్గొన్నారు.వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడా కారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అండర్ 17 జట్లు ఏలూరు జిల్లా నూజివీడులో నవంబర్ 21 నుండి 23 వరకు జరుగు 69వ స్కూల్ గేమ్స్ ఛాంపియన్షిప్లో పాల్గొంటారు. అండర్ 14 జట్లు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో నవంబర్ 23 నుండి 25 వరకు జరుగు 69వ స్కూల్ గేమ్స్ ఛాంపియన్షిప్ లో పాల్గొంటారని ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, శిరీష కుమారి తెలిపారు. జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ టి సుబ్బారావు, అసోసియేషన్ మెంబర్ సయ్యద్ జిలాని భాషా, బాయ్స్ పీడీలు ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం,ఎం నరసింహ, పీడీలు కోటేశ్వరరావు కరుణ కుమార్ ,మాల్యాద్రి ,సుభాషిణి, ఆదిలక్ష్మి రవీంద్ర సుజాత పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - లింగసముద్రం

యుటిఎఫ్ లింగసముద్రం మండల శాఖ నూతన కౌన్సిల్ నిర్మాణ సమావేశం మండల శాఖ అధ్యక్షులు ఎస్. సూర్యనారాయణ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా శాఖ అధ్యక్షులు వి.వి. శేషులు,గౌరవాధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారి కె.మాల్యాద్రి, ప్రధానోపాధ్యాయులు యు.మాధవరావు, కె. సూర్య ప్రకాష్ రావు,టి శ్రీనివాస్ హాజరయ్యారు. జిల్లా శాఖ అధ్యక్షులు వి.వి శేష మాట్లడుతూ ఉపాధ్యాయ సంక్షేమానికి, విద్యారంగ అభివద్ధికి యు.టి..ఎఫ్ విశేషంగా కషి చేస్తుందని,నూతన ఉపాధ్యాయులు సంఘం యొక్క లక్ష్యాలను అర్థం చేసుకొని సంఘంలో పనిచేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు మాట్లడుతూ విద్యారంగ అభివద్ధికి పాఠశాలల పరి రక్షణకు యు.టి.ఎఫ్ కార్యకర్తలు విశేషంగా కషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి టి సుధాకర్ రావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.కే మహేంద్ర ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఈసమావేశంలో పి.ఆర్. సి కమిటీని వెంటనే నియమించి, ఐ.ఆర్ ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలని,పది తీర్మానాలు ఆమోదించారు.జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కె.రమేష్ ని ఇటీవల బదిలీలలో మండలం నుంచి బయటకు వెళ్లిన ఉపాధ్యాయులను, డి.ఎస్.సి లో ఇంగ్లీష్ అసిస్టెంట్ గా సెలెక్ట్ అయిన జి.ఉషారాణి ని అభినందించడం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు.

నూతన కమిటీ సభ్యులు

యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

గౌరవాధ్యక్షులుగా ఎస్. ఇమామ్ హు హుస్సేన్,అధ్యక్షులుగా కె.వెంకట్రావు, సహాధ్యక్షులుగా పి.తిరుపతయ్య సహధ్యక్షు రాలుగా ఎస్.శాంత కుమారి, ప్రధాన కార్యదర్శిగా టి.సుధాకర్ రావు, కోశాధికారిగా యు.రవిబాబు ఎంపికయ్యారు.జిల్లా కౌన్సిలర్స్ గా ఎం.ఎం. సుధాకర్ రావు,డి. మాధవరావు కె.వి. ఎస్.ఆర్. పద్మ కిషోర్, ఐ.సుబ్బారావు, మండల కార్యదర్సులుగా ఎం.లక్ష్మమ్మ,ఎం. కొండలరావు,బి. ప్రభా వతి, కె.శ్రీనివాసులు,ఎం .కొండయ్యఎం.వి.సుబ్బయ్య, షేక్. సుల్తాన్ ఎన్నికయ్యారు.

మహాలక్ష్మీపురంలో.. తాగునీటి కష్టాలు..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని కోడూరు పంచాయతీ మహాలక్ష్మిపురం గ్రామంలో గత నెల రోజుల నుంచి తాగు నీటి ఎద్దడి నెల కొంది. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా వున్నప్పటికీ అటు పాలకులు గానీ, ఇటు అధికా రులు గానీ ప ట్టించుకోక పోవడంపై గ్రామస్తులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామంలో దాదాపు 2వేల మంది ఉన్నారు. గ్రామంలోని తాగునీటి పథకాలు పని చేయడం లేదు. గ్రామంలో గత నెల రోజుల నుండి మిన రల్ వా టర్ ప్లాంట్ కూడా పనిచేయడం పనిచేయడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ప్పటి నుంచి సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదని గ్రామస్తులు చెబుతు న్నారు. స్థానిక టిడిపి నాయకులు ఫోర్జరీ సంతకాలతో బిల్లులు మంజూరు చేసు కోవడంలో పెడుతున్న శ్రద్ధ ప్రజలకు తాగునీట సమస్య పరిష్కరి ంచడండో పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తు న్నాయి.తాగునీటి కోసం మహాలక్ష్మిపురం, చెన్నపల్లి పాలెం గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. పక్క గ్రామాలకు వెళ్లి తాగునీరు తెచ్చు కోవాల్సిన దుస్థితి దాపురించింది. నాయకులమని అ ర్భాటంగా ప్రకటించు కొంటున్న నాయకులు కనీసం పంచాయతీలో త్రాగునీటి సమస్య పరిష్కరించలేక పో తుండడం గమనార్హం. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నా గుక్కెడు తాగునీటికి ఇబ్బందులు పడుతు న్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. తా గునీ టి సమస్యను పరిష్కరించే వి షయంలో అటు అధికా రులు, ఇటు పాలకులు విఫల మవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శా ఖ ఉన్నతాధి కారులు స్పందించి యుద్ధప్రాతిపదికన తాగునీటి సమస్యను ప రిష్కరించాలని మహాలక్ష్మిపురం, చెన్నపల్లిపాలెం గ్రా మాల ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం

సంతకాల సేకరణ

కందుకూరు : కందుకూరు పట్టణం లోని 27వ వార్డు లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ం నిర్వహించారు.అనంతర. అనంతరం 27వ వార్డ్ అధ్యక్షులుగా చవిడిబోయిన శివను ఎన్నుకున్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, గణేశం గంగిరెడ్డి, బ్రహ్మ నందం,వల్లూరి కోటేశ్వరరావు,యడ్ల మాధ వరెడ్డి, తల్లపనేని గోపి,షేక్ రహీం,కొత్తగొర్ల వసంత,పెయ్యల రమణయ్య, కానాల ప్రసాద్, కోటేశ్వరరావు, కుమారస్వామి, వెంకట్రామీరెడ్డి,సుల్తాన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

-నెల్లూరు :జిల్లాగ్రంథాలయంలోగ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం కొనసాగుతున్నాయి. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయోద్యమంలో కృషి చేసిన మహానీయులకు నివాళి అర్పించారు.ముఖ్య వక్తగా రిటైర్డ్ తహసీలదార్ ప్రముఖ రచయిత పి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు

చంద్రాబు, లోకేష్ ఘనత : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

రెండు రోజులపాటు విశాఖ వేదికగా జరిగిన సిఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు రానుండటం సిఎం చంద్రబాబునాయుడు యువత నేత నారా లోకేష్ ఘనతేనని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటనవిడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ రాష్ట్రం కోసం ఎంతగా శ్రమిస్తున్నారో విశాఖ సమ్మిట్ ద్వారా నిరూపితమైందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సివిల్ సర్వీస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

నేటి నుంచి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - నెల్లూరు సంక్షేమం : బిసి వెల్ఫేర్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత శాఖాధికారిణి పి.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఉచిత శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపా రు. అభ్యర్థులు ఏదైనా గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత కలిగి లక్ష రూపాయల లోపు వార్షిక ఆదాయం కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు బిసి, ఎస్‌సి, ఎస్టీ లకు చెందినవారై ఉండాలన్నారు. నవంబర్ 17 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. డిసెంబర్ 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందన్నారు. విజయవాడలో శిక్షణ ఉంటుంద న్నారు.వివరాలకు 9381554779, 80119375443 నెంబర్లకు సంప్ర దించాలని ఆమె కోరారు.

ఆటో కార్మికుల సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - సైదాపురం :నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం, సైదాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం మండల కేంద్రంలో జరిగింది. సిఐటీయూ నెల్లూరు జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు మాట్లాడారు. కార్మికులకు ఇబ్బందిగా ఉన్న వాహనాల సెన్సార్ ట్రాకింగ్ పద్ధతిని రద్దు చేయాలన్నారు. గతంలో ఏ విధంగా అయితే ఫిట్నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేశారో అదే విధంగా మంజూరు చేయాలన్నారు. అనంతరం 18 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కొండిపాకు పెంచలయ్య, కార్యదర్శిగా కుంచం రత్నగిరి,ఉపాధ్యక్షుడిగా మగ్గం హేమంత్ కుమార్, సహాయ కార్యదర్శిగా చలపతి, రవీంద్ర, గౌరవాధ్యక్షుడుగ చింతగుంట శ్రీనివాస్, ఎన్నికయ్యారు ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్ల విస్తరణ పనులు

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.ఎన్టీఆర్ విగ్రహం నుంచి పామూరు రోడ్డు సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. విస్తరణ దాదాపు పూర్తి కావడంతో డివైడర్లు ఏర్పాటు చేయడానికి రంగ సిద్ధమైంది. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి మహాదేవపురం రోడ్డు వరకు రోడ్డు విస్తరణతో పాటు కాలువల నిర్మాణం జరుగుతోంది. పట్టణంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చడానికి ఎంఎల్ఎ ఇంటూరు నాగేశ్వరరావు ఈ పనులకు శ్రీకారం చుట్టారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

జన్మనిచ్చే బిడ్డ ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, అవసరమైన మేరకు చికిత్సలు చేసుకొనే నిమిత్తం వైద్యులు గర్భిణీలకు స్కానింగ్ పరీక్షలు చేసుకోవాలని సూచించడం సర్వసాధారణం. అయితే పరీక్షలు చేసే సమయంలో స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు నుంచి తాము జన్మనిచ్చేది ఆడ బిడ్డా.. మగ బిడ్డా.. అన్న సమాచారం తెలుసుకొని తాము జన్మనిచ్చేది ఆడబిడ్డ అని తెలిస్తే గర్భంలోనే చంపేస్తూ అత్యంత దారుణానికి పాల్పడుతున్నారు. ఈ విధంగా చేయడం వల్ల సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గుముఖం పడుతుంది. ఈ దారుణాన్ని, దుర్మార్గపు చర్యలను నివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1994 గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని రూపొందించి. జిల్లాలో ఈ చట్టం అమలు తీరు ఏలా ఉన్నది. చట్టాన్ని అతిక్రమించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత మాటల్లో...

ప్రశ్న. జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం సక్రమంగా అమలు జరుగుతుందా.. స్కానింగ్ కేంద్రాలు ఈ చట్టాన్ని అతిక్రమిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలపై మీ స్పందన ఏమిటీ..?

జవాబు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నియమనిబంధనల మేరకు (పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం) గర్భిణులకు పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో పిసి అండ్ పిఎన్‌డిఇ యాక్ట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ప్రజలకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలి. వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం.. అన్న ఫ్లేక్సీని స్కానింగ్ కేంద్రంలో అమర్చాలి. స్కానింగ్ కేంద్రాలకు పరీక్షల నిమిత్తం వచ్చే వారికి అందజేసే రిపోర్టు కాగితంపై విధిగా లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని ముద్రించి ఉండాలి. స్కానింగ్ కేంద్రాల్లో వినియోగిస్తున్న పరికరాలకు సంబంధించిన కంపెనీ వివరాలు జిల్లా కేంద్రాలకు అందజేసి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. స్కానింగ్ కేంద్రాలల్లో గర్భిణులకు పరీక్షలు నిర్వహించే సమయంలో వారికి సంబంధించిన పూర్తి వివరాలతో పూరించిన ఫాం-ఎఫ్ ప్రతినెలా 2వ తేదిలోగా జిల్లా కేంద్రానికి అందజేయడంతోపాటు రెండు సంవత్సరాల పాటు స్కానింగ్ కేంద్రాలల్లో భద్రపరచాల్సి ఉంటుంది.

ప్రశ్న. స్కానింగ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారా.. తనిఖీలు నిర్వహించేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు. అధికారులను ఏమైనా నియమించారా..?

జవాబు. జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి అండ్ పిఎన్‌డిటి) పకడ్బంధీగా అమలు చేయడానికి జిల్లాలోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేయడానికి జిల్లాస్థాయి, పోగ్రామ్ ఆఫీసర్స్‌ను 10 మందిని నియమించాం. ఈ అధికారులు జిల్లాలో వారికి కేటాయించిన స్కాన్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేసి పది రోజులకు ఒక నివేదిక జిల్లా కేంద్రానికి అందజేస్తారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు పీసి అండ్ పిఎన్ డిటి చట్ట పరిధిలో వారి కేంద్రాలను నిర్వహించుకోవాల్సిందిగా, చట్ట ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే తీవ్రమైన చర్యలు తప్పని సరిగా తీసుకుంటాం. స్కానింగ్ కేంద్రాల్లో పిసి అండ్ పిఎన్‌డిటి చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు పక్కా ఆధారాలు అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, తాము ఆకస్మిక తనిఖీలు చేసి చట్టాన్ని అతిక్రమిస్తున్నట్లు తాము గుర్తిస్తే వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారైనా ఉపే క్షించేది లేదు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణల కోసం స్కానింగ్ దుర్వినియోగం కాకుండా నివారించేందుకు జిల్లాలోని ్కానింగ్ సెంటర్లపై నిశితమైన నిఘా, పర్య వేక్షణలు కొనసాగించాలని సిబ్బందికి సూచనలు చేశాం.

ప్రశ్న. జిల్లాలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఎవరైనా పిసి అండ్ పిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘించినట్లు కేసులు నమోదు చేశారా.. వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు. జరిమానా ఎంత మేరకు విధిస్తారు..?

జవాబు. ఇప్పటి వరకు జిల్లాలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పిసి అండ్ పిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘించినట్లు కేసులు నమోదు కాలేదు. ప్రభుత్వ నియమనిబంధనల మేరకు ఈ చట్టంలోని నిబంధనలు మొదటి సారి ఉల్లంఘించిన వైద్యులు / నిపుణులు / ఇతరులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించబడుతుంది. తదుపరి ఉల్లంఘనకు రూ.50వేల జరిమానాతోబాటు ఐదేళ్ల జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుంది. అంతేకాకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు చెప్పమని అడిగిన, అడగమని ప్రోత్సహించిన ,చెప్పిన వారికి మొదటి తప్పుకు చట్టప్రకారం 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.50వేలు జరిమానా విధించబడుతుంది. ఇదే నేరం రెండవ సారి చేసినట్లైతే 5 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించబడుతుంది. ఈ నేరాన్ని మొట్ట మొదటి సారిగా ఎవరైనా డాక్టర్ చేసినట్లు రుజువైతే పై పేర్కొన్న శిక్షలతోపాటు వారి వైద్య పట్టా భారత వైద్య మండలి నుంచి 5 సంవత్సరాలు సస్పెండ్ చేస్తారని, తిరిగి మళ్లీ రెండోసారి అదే నేరానికి పాల్పడితే శిక్షలతోపాటు వైద్య పట్టా పూర్తిగా రద్దు చేయబడుతుంది.

మాట్లాడుతున్న వైసిపి నేత మద్దిపోయిన వీరరఘు

కావలి కెనాల్ కాలువకు నీరందించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

కావలి కెనాల్ కాలవకు సోమవారం లోపు నీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో కార్యాలయాల వద్ద రైతులతో ధర్నా చేస్తామని వైసిపి బోగోలు మండల కన్వీనర్ మద్దిపోయిన వీర రఘు డిమాండ్ చేశారు. మండలంలోని రైతుల నీటి సమస్యపై బోగోలు మండల వైసిపి కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మద్దిబోయిన వీరరఘు మాట్లాడుతూ సోమశిల డ్యామ్‌లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ కావలి కెనాల్ కాలువ బ్రాంచి కెనాల్ అయినా ఎస్‌విపిఎం చామాదల, దామవరం కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి వరి నాటుకునేందుకు రైతులకు సహకరించాలని, డిమాండ్ చేశారు. గత వైసిపి అధికారంలో ఉన్నప్పుడు పార్టీలకు అతీతంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీలో విత్తనాలను అందజేశారని, రైతులకు ఉచిత బీమా పథకం ఉండేదని, ఇప్పుడు ఆ పథకాన్ని ఎత్తివేసారని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ్యులు, నీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నుకోబడిన వారికి రైతుల నీటి కష్టాలు కనపడటం లేదని ప్రశ్నించారు. నవంబర్ 15 వచ్చినప్పటికీ బీపీటీలు వేసుకోవాల్సిన రైతులు నీరు లేక కేఎన్ఎంలు వేసుకుంటున్నారని తెలిపారు. నాగులవరం సీనియర్ నాయకులు పాపన్న మల్లారెడ్డి మాట్లాడుతూ సోమశిల డ్యామ్‌లో పుష్కలంగా మీరు ఉన్నాయని, నీటిని పెన్నానది ద్వారా వృధాగా సముద్రానికి వదిలేస్తున్నారని, తెలుగుదేశం ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. నాగలవరం గ్రామంలోగత ప్రభుత్వంలో నాలుగు టన్నులు జనులు తెప్పించి ప్రతిఒక్క రైతుకు అందించమని, ఇప్పుడు ఉన్న ప్రభుత్వంలో ఒక టన్ను జనులు ఒక జనుఉల్లు, ఒకటన్ను యూరియా మాత్రమే తెప్పించి ఆరోజు పోయిన రైతులకు, వారి పార్టీ వారికి మాత్రమే తూ.తూ. మంత్రంగా ఇచ్చారని తెలిపారు. తుపాన్‌లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంలో టిడిపి ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కె సురేందర్ రెడ్డి, ఉప్పాల మాచర్ల, మేకల శ్రీను, వెంకయ్య, కళ్యాణ్, తోటపల్లి సాగర్, మహేందర్, ప్రవీణ్, వరుణ్ సుధాకర్, సుధాకర్, ప్రసాద్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాపుల వనభోజన మహోత్సవం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం యేటూరి రామిరెడ్డి కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన కాపుల కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. వారిని కాపు కులస్తులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. కాపు మహిళల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డిని కాపు కమిటీ సభ్యులు, మహిళలుఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ నీతికి నిజాయితీకి మారుపేరు కాపుకులస్తులని అని తెలిపారు. సాధించాలనే శక్తి, ఎక్కువ కాపుల ప్రత్యేకత అని, తన విజయంలో కీలక పాత్ర పోషించిన ఈ కాపులను తాను ఏనాటికీ మరవను అని ఎంఎల్‌ఎ స్పష్టం చేశారు. "కాపు భవన నిర్మాణానికి నా వంతుగా రూ.25లక్షల ఆర్థికసాయం అందిస్తాను" అని ప్రకటించగా సభలో ఆనందంతో హర్షధ్వానాలు మారుమోగాయి. ఎంఎల్‌ఎ ప్రియ శిష్యుడు మామిడాల సాయికుమార్, తన గురువు మీద ప్రేమతో ఎంఎల్‌ఎ [illegible] ప్రత్యేకంగా అభివందనాలు తెలిపారు. కార్యక్రమంలో కాపుపెద్దలు దేవరకొండ శ్రీనివాసరావు, బండి కోటి చలపతి రావు, సింగంశెట్టి పద్మావతి శ్రీదేవి, పసుపులేటి బాబూరావు, వేముల చిన్నకేశవులు నాయుడు, బండారు మహేష్ నాయుడు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : అనుమసముద్రం గ్రామంలో ఆదివారం ఉదయం పోలేరమ్మకు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చిలకపాటి మస్తాన్నాయ్య మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో గ్రామంలోని సయ్యద్ సంధాని, దాగూర్ స్కూల్ యాజమాన్యం, తదితర దాతల సహాయ సహకారంతో శ్రీ పోలేరమ్మ దేవస్థాన ఆలయ ప్రాంగణం పాలిష్ గ్రానైట్ నవీకరించి, వాల్ పోస్టర్ విగ్రహం ప్రతిమలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో అమ్మవారి దేవస్థానం దగ్గర పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పలువురు ప్రజలు పాల్గొనడం జరిగింది. శ్రీ పోలేరమ్మ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఆలయ అభివృద్ధికి మంత్రి ఆనం కృషి

ప్రజాశక్తి-ఆత్మకూరు: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సారథ్యంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఉన్న ఆలయాలు అభివృద్ధి చెందడం సంతోషకరం అని న్యాయవాది, సామాజికవేత్త ఆల్ల వెంకటరమణయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిట్రగుంటలోని వెలసియున్న కలియుగ ప్రత్యక్ష దైవం బిలకూట క్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దర్శించుకున్న ఆయన ఆలయ ప్రాంగణంలోని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖ అధికారులు సౌకర్యాలు కల్పించడం ఆలయ అభివృద్ధి పనులు చేపట్టడం శుభపరిణామం అని తెలిపారు.

ప్రయాణికులు సహకరించాలి

ప్రజాశక్తి - ఉదయగిరి : నెల్లూరు వైపు వెళ్లే బస్సు ప్రయాణికులు మారిన బస్సు రూట్‌ను గుర్తించి సహకరించాలని డిపో మేనేజర్ రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ఉదయగిరి డిపోకు చెందిన బస్సులు జొన్నవాడ మీదుగా మళ్లించనున్నట్లు డిపో మేనేజర్ రమేశ్ కుమార్ తెలిపారు. నెల్లూరు పినాకిని బస్టాండ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి మరమ్మతులు కారణంగా ఈ నిర్ణయం జరుగుతున్నట్లు కారణంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

ఎంఎల్‌ఎ కృష్ణారెడ్డికి ఘనస్వాగతం

ప్రజాశక్తి-కావలి : కావలి పరిధిలోని వనమిత్రలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటపర్తి రమేష్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి ఆర్యవైశ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎంఎల్‌ఎ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు, పెనుగొండ పీఠాధిపతి బాల స్వామీజీ చేతుల మీదుగా ఎంఎల్‌ఎ ప్రత్యేకపూజలు, నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కావలి నియోజకవర్గం ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. పెనుగొండ పీఠాధిపతి బాల స్వామీజీ పాల్గొని శివపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారుల ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు సభలో ఉన్న వారిని అలరించాయి. ఆర్యవైశ్యుల కార్తీక మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటపర్తి రమేష్, వారి బృందాన్ని ఎంఎల్‌ఎ అభినందించారు. ఆర్యవైశ్యులకు [illegible] అండగా ఉంటానని హామీనిచ్చారు. కార్యక్రమం మొత్తం భక్తి, ఐక్యత, వాతావరణంలో, భక్తి జనసందడి మధ్య విజయవంతంగా ముగిసింది. వనమిత్ర ప్రాంగణం కార్తీక మాసానికి తగిన ఆధ్యాత్మిక వాతావరణంతో సందడి చేసింది. వేలాదిమంది ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, పెద్దలు, మహిళలు, చిన్నారులు మహోత్సవానికి భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మొక్కను నాటుతున్న ఎంఎల్‌ఎ కృష్ణారెడ్డి

గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కోవూరు: కోవూరు శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మూడవ రోజు వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ వ్యక్తులైన గ్రంథాలయ ఉద్యమకారులు ఐఎన్‌జి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్‌ల గురించి పిల్లలకు తెలియజేశారు. వారి గొప్పతనాన్ని గురించి వారు వారు గ్రంథాలయంలో స్థాపించడానికి చేసిన కృషిని గురించి తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి డిప్యూటీ డిఇఒ ఎస్ వి నాయక్, అతిథులు భాస్కర్‌రావు (టీచర్), బి.వెంకయ్య (టీచర్), ఎస్‌కె.రహంతుల్లా (టీచర్), ఆర్.సత్యనారాయణ (రీడర్స్ కమిటీ మెంబర్), ఎ.శ్రీనివాసులు రెడ్డి, పి.రంగారెడ్డి (టీచర్), ఎస్.జయ రామయ్య (రిటైర్డ్ ఎండిఒ) శైల (జల విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి), గ్రంథాలయ పాఠకులు హాజరయ్యారు.

ప్రజాశక్తి-విడవలూరు : ఉద్యమాలతోనే విజయాలు సాధ్యమని ఉద్యమాలు చేసిన వారి గురించి విద్యార్థులకు తెలియజేస్తూ ఆదివారం విడవలూరు గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులను స్మరించడం జరిగింది వారిలో ముఖ్యులు లైబ్రరీ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్‌కు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రామన్నపాలెం గేటు వద్ద డిఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండల పరిధిలోని రామన్నపాలెం గేటు సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రూరల్ డిఎస్‌పి ఘటం శ్రీనివాసరావు శుక్రవారం అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కోవూరు ఎస్‌ఐ కె.ముత్యాలరావు, పోలీసు సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ, హెచ్చరిక బోర్డులు, రోడ్డు భద్రత చర్యలను మరింత బలోపేతం చేయాలని డీఎస్పీ ఆదేశించారు.

అన్నమ్మ నేత్రదానం

ప్రజాశక్తి-విడవలూరు : జాన్‌పేటలో నివాసం ఉంటున్న ఎల్లు అన్నమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను మనసేవా సంస్థ సహకారంతో ఆమె నేత్రాలను నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు టెక్నీషియన్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ గ్రంథాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి : అంబేద్కర్ బుద్ధవిహార్‌లో ఆదివారం జరిగిన ఓ ప్రత్యేకమైన కార్యక్రమంలో బొర్రా గోవర్ధన్ రచించిన పుస్తకాలు ధర్మతేజ, ధర్మ వీణ, బుద్ధ ధర్మసారం అనే పుస్తకాలను గాడ్ల హరిప్రసాద్ బోధి, బుద్ధ విహార్ సభ్యులతో, విద్యార్థులతో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. అలాగే గాడ్ల హరిప్రసాద్ బోధిని విహార్ సభ్యులు, విద్యార్థులు సన్మానించారు. ఈ గ్రంథాల ఆవిష్కరణలో పాలేటి పుల్లయ్య బోధి, సంఘ జ్యోతి, పూజల జయప్రకాష్, డాక్టర్ శివప్రసాద్, పూజల మమత, జ్యోతి వంశీ బోధి, కావలి జీవన్ బోధి, విహార్ విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకమరాజుకు పరామర్శ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

వెంకమరాజు సతీమణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం సీనియర్ నాయకులు జొన్నలగడ్డ వెంకమ రాజును ఆదివారం పలువురు సిపిఎం నాయకులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జొన్నలగడ్డ వెంకమరాజు సతీమణి జొన్నలగడ్డ నర్మదా మృతి చెందడంతో అఖిలభారత వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, వ్యవసాయ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కంకణాల ఆంజనేయులు, బుచ్చిరెడ్డిపాలెం పట్టణం అంబేద్కర్ నగర్లో వెంకమరాజు నివాసంలో ఆయనను పరామర్శించి భగవంతుడు ఆయనకు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటూ ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల గురునాథం, స్థానిక పట్టణ కార్యదర్శి, పోతంశెట్టి శ్రీనివాసులు, మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, పలువులు జిల్లా, మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

'అలహరి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బిట్రగుంట

కావలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి అలహరి సుధాకర్ జన్మదిన వేడుకలు బోగోలు మండలం జనసేన అధ్యక్షులు తిరుమల శెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో బోగోలు బజార్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోగోలు టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, బిజెపి జిల్లా నాయకులు నూకసాని శ్రీనివాసులు పాల్గొని కేకులు కట్ చేసి జనసేన సైనికులకు, కూటమి ప్రభుత్వం నాయకులకు కేకును, చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపించినప్పుడు నుండి అలహరి సుధాకర్ ఒక సైనికుడి లాగా జనసేన పార్టీ కోసం పని చేస్తున్నారని, కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటూ కూటమి ప్రభుత్వం గెలుపునకు ఆయన వంతు కృషి చేసిన వ్యక్తి అని, ఆయన జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భగవంతున్ని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి మండల జనరల్ సెక్రటరీ లేళ్లపల్లి సుధీర్ బాబు, విశ్వనాథరావుపేట వార్డు సభ్యులు చిలక జయరామయ్య, టిడిపి సీనియర్ నాయకులు ఎస్‌కె రఫీ, జనసేన మండల కమిటీ సభ్యులు కార్తీక్, సురేష్, కొడింగారి శ్రీనివాసులు, కాలేబు, రవి, యాలపల్లి శీను, నాగరాజు, శీను, సాయి, టిడిపి నాయకులు, జనసేన కార్యకర్తలు వీర మహిళలు బోగోలు బజార్ సెంటర్లోని దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చెంచలబాబు యాదవ్

వనభోజనాలు ఐక్యతకు ప్రతీక

ప్రజాశక్తి-మర్రిపాడు

కార్తీకమాస వనభోజనాలలో భాగంగా ఆదివారం యాదవులు తహశీల్దార్ కార్యాలయం నుండి పిఎస్ఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గోపూజ, ఉసిరిక చెట్టు, శివ పూజ చేశారు. కార్యక్రమానికి జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు నాగకిశోర్ యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచలబాబు యాదవ్ మాట్లాడుతూ యాదవ జాతి విద్య, ఐకమత్యంతో ముందుకు సాగాలని, గ్రామాలలో అన్నివర్గాల ప్రజలను కలుపుకొని రాజకీయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్తీక మాసం సందర్భంగా శివుని ఆశీస్సులు, శ్రీ కృష్ణ భగవాన్ ఆశీస్సులు అందరికీ ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.ప్రతి రంగంలో ముందుండాలని, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. అందరూ కలసి కట్టుగా ఉండి సంఘాన్ని శక్తి వంతంగా బలోపేతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిఐడిసి డైరెక్టర్ కటారి రమణయ్య, టిడిపి మండల కన్వీనర్ గంగాధర్ యాదవ్,పడచల నాగేశ్వరరావు, గుర్రం నాగేశ్వరరావు, గుర్రం శ్రీనివాసులు, యలగాల వెంకటేశ్వర్లు, రాచాల శ్రీనివాసులు కర్యావుల శ్రీనివాసులు, డబ్బుకొట్టు నాగరాజు, తిరుపతి, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధనార్జనే ధ్యేయంగా బెల్ట్‌జోరు..

- అక్రమార్జనే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు
- రాజకీయ అండతో రెచ్చిపోతున్న మద్యం మాఫీయా
- ప్రతినెలా కోట్లకు పైగా మద్యం అమ్మకాలు
- కళ్ళకు గంతలు కట్టుకున్న ఎక్సైజ్ పోలీస్ నిఘా
- మహిళలు రోడ్డెక్కిన స్పందన కరువు

ప్రజాశక్తి-జలదంకి

పల్లెల్లో బెల్ట్ షాపుల మద్యం వ్యాపారం జోరందుకుంది. ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజల మండిపడుతున్నారు. వైన్‌షాపు యజమానుల అండ దండలతో వాడవాడల్లో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. దాంతో పల్లెలు బెల్ట్ షాపుల దందాకు కేంద్రంగా మారాయి. రాజకీయ నాయకుల అండతోనే మద్యం మాఫియా రెచ్చిపోతుందని ప్రజలు అంటున్నారు. బెల్ట్ జోరుకు కళ్ళెం వేసి ఎక్సైజ్, పోలీస్ నిఘా వర్గాలు కళ్ళకు గంతలు కట్టుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజల విమర్శిస్తున్నారు. దాంతో ప్రతినెలా కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. ఎంఆర్‌పి కంటే అదనంగా మాకు మరో రూ.30 ఇస్తే ఏ అధికారి కూడా మీ జోలికి రారంటూ మద్యం షాపుల యజమానులు బహిరంగంగా పేర్కొంటున్నట్లు బెల్ట్‌షాప్ నిర్వాహకులు చెబుతున్నారు. లైసెన్స్ మద్యం షాపు యజమానులే తమ సిబ్బంది ద్వారా ఆటోలు మోటార్ బైకులు పెట్టి మద్యం సీసాలను బహిరంగంగా బెల్ట్‌షాపులకు తరలిస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు గ్రామస్థాయి నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులకు విన్నవించిన స్పందించడం లేదంటున్నారు. ఈ వ్యవహారంలో నెలనెలా మాముళ్ళ మత్తులో జోగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. బెల్ట్‌షాపుల మూలంగా పల్లెల్లో 18 ఏళ్ల నిండని బాలురు కూడా మద్యానికి బానిసలు అవుతున్నారని పిల్లల తల్లిదండ్రులు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కష్టించిన సంపాదనంతా తమ భర్తలు మద్యానికే తగలేస్తున్నారని మహిళలు వాపోతున్నారు. కావలిలో ఉండే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి జలదంకి మండలం కూతవేటు దూరంలో ఉంది. ఈ మండలంలో నాటుసారా వాసన వస్తే పసిగట్టి ఎక్సైజ్ పోలీస్ శాఖలు కొరడా ఝులిపిస్తున్నాయంటున్నారు. నిబంధనలు ఉల్లగించే వైన్‌షాప్ యజమానులపై బెల్ట్‌షాప్ నిర్వాహకులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

క్వార్టర్‌పై రూ.80 నుండి రూ.100 అదనం

ప్రభుత్వం సామాన్యులకు నాణ్యమైన మద్యం అందించాలని క్వార్టర్ లిక్కర్‌ను రూ.99 ప్రవేశ పెట్టింది. అయితే బెల్ట్ షాపుల్లో ఎంఆర్‌పి కంటే అదనంగా క్వార్టర్‌కు రూ.80 నుండి రూ.100 వరకు వసూలు చేస్తున్నారని మందుబాబులు పేర్కొంటు న్నారు. ఇదేంటని మందుబాబులు ప్రశ్నిస్తే తాము లిక్కర్కు రూ.30, బ్రాండెడ్ క్వార్టర్కు రూ.40, బీరు కైతే రూ.50 లెక్కన అదనంగా చెల్లిస్తేనే మద్యం సరఫరా చేస్తున్నారని వారి కమీషన్ పోను ఇందులో తమకేమి మిగులుతుందంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారని చెప్తున్నారు.

బెల్ట్‌షాపుల ఏర్పాటుకు రూ.50వేల నుండి రూ.లక్ష డిపాజిట్

పల్లెల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకోవాలంటే ఒక్కొక్క షాపుకు రూ.50 వేల నుండి లక్ష రూపాయల వరకు డిపాజిట్ వసూలు చేస్తున్నట్లు బెల్ట్‌షాప్ నిర్వాహకులు పేర్కొంటున్నారు. మండలంలో మొత్తం 17 పంచాయతీ గ్రామాలతోపాటు మరో 15 మజారా గ్రామాలు ఉన్నాయి. మొత్తం 32 గ్రామాలకు గానూ 4 లైసెన్స్ వైన్ షాపులు ఏర్పాటు చేసిందీ ప్రభుత్వం. లైసెన్స్ వైన్ షాపులున్న గ్రామాలను మినహాయిస్తే మిగిలిన 28 గ్రామాల్లో ప్రతి గ్రామానికి ఎస్‌సి ఎస్‌టి మైనారిటీ కాలనీలు ఉన్నాయి. ప్రధాన గ్రామాలతో పాటు దళిత కాలనీలను కలుపుకుంటే 112 సెంటర్లుగా లెక్కలు వస్తున్నాయి. ప్రతి సెంటర్లో జనాభాను బట్టి ఒకటి రెండుకు పైగా బెల్ట్ షాపులు ఉన్నట్లు సమాచారం. ఒక్కొక్క షాపులు రోజుకు 50 లిక్కర్ క్వార్టర్ బాటిళ్లు అమ్ముడుపోతున్నట్లు సమాచారం. మండలంలో 112 కేంద్రాల్లో ఒక్కొక్క బెల్ట్ షాపులో 50లిక్కర్ బాటిళ్ల లెక్కనా రోజుకు 5600 లిక్కర్లు అమ్ముడుపోతున్నట్లు సమాచారం. ఎంఆర్‌పి తీసేస్తే అదనంగా రూ.80తో రోజుకు నాలుగున్నర లక్షల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నట్లు సమాచారం. లిక్కర్ క్వార్టర్ల పరిస్థితి ఇలా ఉంటే బ్రాండెడ్ క్వార్టర్లు బీర్లు లెక్కిస్తే ఆ లెక్కలు నింగిలోని చుక్కలను చూస్తాయని పలువురు అంటున్నారు. ఈ లెక్కన నెలకు కోట్లకు పైగా అమ్మకాలు సాగుతున్నట్లు ప్రచారముంది.

గుర్రపుడెక్కతో ఎరువు తయారీ

ప్రజాశక్తి-సంగం

మండలంలోని తరుణవాయి గ్రామంలో ఏర్పాటు చేసిన గుర్రపు డెక్క నుండి ఎరువు తయారీ కేంద్రాన్ని డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజ కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె తయారీ విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజ కుమారి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం వ్యర్థంగా పడి ఉన్న గుర్రపు డెక్క ఆకును ఎరువుగా తయారు చేయడం అని తెలిపారు. గుర్రపుడెక్కను ఉపయోగించి ఎరువు తయారు చేయడం వల్ల రైతులకు ఎరువుగా ఉపయోగపడటంతో పాటు, పొలాలకు నీళ్లు పారడానికి ఉన్న అడ్డంకి కూడా తొలగిపోతుందని ఆమె వివరించారు. ఈ లక్ష్యంతో జిల్లాలో మొట్టమొదటగా సంగం మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను మొదటగా వెస్ట్ గోదావరిలో అమలు చేశారని, అక్కడ విజయం సాధించిన విధానాన్ని పరిశీలించడానికి తమ సిబ్బందిని పంపించి, వారు చూసుకొని వచ్చిన తర్వాత ఇక్కడ ప్రారంభించినట్లు తెలిపారు. గుర్రపుడెక్కతో ఎరువు తయారవడానికి 60రోజులు పడుతుందని ఆమె వివరించారు. ఎరువు తయారైన తర్వాత, దాని నాణ్యతను పరీక్షించడానికి అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ సహకారంతో టెస్టింగ్‌కు పంపిస్తామని నాగరాజ కుమారి తెలియజేశారు. టెస్టింగ్‌లో విజయం సాధిస్తే, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం కట్టిన షెడ్స్‌ను ఉపయోగించుకుని, మిగతా ప్రాంతాలకు కూడా ఈ గుర్రపుడెక్క ఎరువు తయారీని కలెక్టర్ సహకారంతో విస్తరించాలని ఆలోచనలో ఉన్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, డిపిఎం మధుసూదన్, ఎపిఎం రవిశంకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్కతో ఎరువు తయారీ విధానం సందర్శన

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం బోగోలు పంచాయతీ చెంచులక్ష్మిపురం గ్రామంలో ఆదివారం అల్లూరు ఎంపిపి శశిరేఖ, రవి వివాహ వేడుకలో కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వధువు తల్లిదండ్రులు దర్శిగుంట వెంకయ్య, శశిరేఖ, మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాగుల వరం వ్యవసాయ సహకార సంఘం సొసైటీ చైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు, కావలి కాలువ 1, అధ్యక్షులు, కండ్లగుంట మధుబాబు నాయుడు, బోగోలు మండల ప్రధాన కార్యదర్శి లేలపల్లి సుధీర్, ఐటిడిపి అధ్యక్షులు గోచిపాతల సంజయ్, సీనియర్ నాయకులు బోగిరి ప్రభాకర్, టీచర్ బుద్ధయ్య, పులివెందల వినోద్, ఎండ్లూరి నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితురాలిని పరామర్శిస్తున్న పోలీసులు

ఆటోను ఢీకొన్న సిమెంట్ ట్యాంకర్

ప్రజాశక్తి-మర్రిపాడు

నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై నందవరం క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వ్యవసాయ కూలీలను తీసుకొని వెళ్తున్న ఆటోను సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టడంతో బోల్తా పడింది. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలసి ప్రమాద స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని 108వాహనంలో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. పది మందికి స్వల్ప గాయాలు కాగా తీవ్రంగా గాయపడ్డ మహిళను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని ఎస్‌ఐతో కలసి సిఐ గంగాధర్‌రావు క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలైన నందవరం క్రాస్ రోడ్డు, మర్రిపాడు సెంటర్‌లో పోలీసులు జిగ్‌జాగ్ బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

డాక్టర్‌కు మొక్కను అందజేస్తున్న దృశ్యం

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కావలి : స్థానిక డాక్టర్ లక్ష్మీకృష్ణారావు విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం "మోడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్" నెల్లూరు వారి ఆధ్వర్యంలో డయాబెటిక్ రెటినోపతి కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 300మంది రోగులను పరీక్షించగా వారిలో 145మందికి డయాబెటిక్ రెటినోపతి సమస్య ఉన్నట్లుగా గుర్తించారు. రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహణ మందులు ఉచితంగా పంపిణీ చేసి వైద్య సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో సభా నిర్వహణలో అధ్యక్షులుగా పాఠశాల కరస్పాండెంట్ వై.విజయ్‌శంకర్ రెడ్డి, డాక్టర్.హెచ్. భారతి, డాక్టర్ జి.విష్ణు తేజ, డాక్టర్ పి.చిన్మయి, డాక్టర్ ఓ.రేవనా రెడ్డి, డాక్టర్ డి.లావణ్య, డాక్టర్ ఎ.ఉమాచంద్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, ఒంగోలు

IA No : 966/2023

in

OS No : 114/2009

రాపూరి ప్రభావతి ....పిటిషనర్ /వాది

వర్సెస్

ఈదుపల్లి రత్తమ్మ & వగైరాలు ....రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

To

R3) అద్దేపల్లి కోటేశ్వరమ్మ

భర్త రాజమోహన్, వయస్సు& 67సంవత్సరాలు, హౌస్ వైఫ్, రామమూర్తిపేట, కరెంట్ ఆఫీసు రోడ్, కావలి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పైతెలిపిన 3వ రెస్పాండెంటు(R3)కు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకోనందున కోర్టు వారు నీనోటీసు నిమిత్తంతేది28-11-2025కు వాయిదా వేసియున్నారు కావుననీవు ఆరోజు ఉదయం గం.10:30 నిమిషాలకు నీవు స్వయంగా గాని వకీలు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై నీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయను. లేని యెడల నీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు

కరవది రాఘవరావు

ఆరిగ శ్రీలక్ష్మీ,

అడ్వకేట్స్, ఒంగోలు